## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



రామాయంపేట, మే 30: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ రజినీ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్ కార్యాలయం ఎదుట జిల్లా బాలల సంరక్షణ కమిటీ నేతృత్వంలో కరపత్రాలను ఆవిష్కరించి, అక్కడే గోడకు కరపత్రం అతికించారు.అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే 1098కు కాల్ చేయాలన్నారు. జిల్లా బాలల సం రక్షణ విభాగం అధికారులు ఆంజనేయులు, మధుకర్, ఆర్ఐ గౌస్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కంఠారెడ్డి ట్రస్టు నాయకులు

రామాయంపేట, మే 30: రామాయంపేట పురపాలిక పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన చేపూరి దుర్గయ్య (65) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం బాధిత కుటుంబానికి మెదక్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన ట్రస్టు నుంచి రూ.5 వేలు నగదును బీఆర్ఎస్ పట్టణ నాయకుల ద్వారా కుటుంబీకులు అందజేశారు. అప్పొద్దీరన్, సాయికుమార్ ఉన్నారు.

## ఇందిరమ్మ గృహాలకు శంకుస్థాపన

పెద్దశంకరంపేట, మే 30: ఇల్లులేని పేదవాడికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట, మూసాపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో షాకీర్ అలీ, నాయకులు సంతోష్‌కుమార్, పండరి, అంజిరెడ్డి, బక్కారెడ్డి, శేఖర్, తదితరులున్నారు.

## గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

వెల్దుర్తి, మే 30: గోవుల అక్రమ రవాణాను అడ్డుకుని గో రక్షణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని బీజేపీ మాసాయిపేట మండల యువ మోర్చా సభ్యుడు డిప్యూటీ తహసిల్దార్ వసంత, ఆర్ఐ ధన్ సింగ్, చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

## ఘనంగా జగదంబ, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ



నిజాంపేట, మే30: బచ్చురాజ్‌పల్లిలో నిర్మించిన సేవాలాల్ ఆలయంలో జగదంబ, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో హోమం, శివపార్వతుల కల్యాణం, సేవాలాల్, జగదంబ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ప్రేమ్‌సింగ్ మహరాజ్, లీలా గ్రూప్ చైర్మన్ డా.మోహన్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ నేత నరేందర్‌నాయక్‌ను పరామర్శించారు.

## రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు



పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న అధికారులు

వెల్దుర్తి, మే 30: భూసారం పెంచడం కోసం రైతులకు రాయితీపై ప్రభుత్వం అందించే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మాసాయిపేట ఏవో రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం మాసాయిపేట ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను ఏఈవో రజితతో కలిసి పంపిణీ చేశారు. మాసాయిపేట మండలానికి 80 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని, ఒక్కో బస్తా 30 కేజీలు ఉంటుందని, ఈ బస్తా ధర రూ. 2,137 ఉందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్‌లు తీసుకొని మాసాయిపేట రైతు వేదిక వద్దకు రావాలని సూచించారు.


## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



చెల్లాచెదురుగా ఉన్న విద్యుత్ తీగలు

రామాయంపేట, మే 30: రామాయంపేటలోని ఎనిమిదో వార్డులో కర్ర విరిగి పోవడంతో విద్యుత్ తీగలు చెల్లాచెదురయ్యాయి. శుక్రవారం ప్రధాన దారిలో కొంతకాలంగా విద్యుత్ కేబుల్ వేలాడడంతో వర్షాలకు కర్ర అడుగు భాగంలో చెడిపోవడంతో ఈదురు గాలులకు విరిగిపోయింది. దీంతో దగ్గరలోనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్స్ అన్ని చెల్లా చెదురయ్యాయి. దశాబ్ద కాలంగా ఒకే పోల్‌కు విపరీతంగా కనెక్షన్‌లు ఉండడంతో అక్కడి ప్రాంత వాసులు ప్రమాదం జరుగకుండా కర్రను నిలిపి విద్యుత్ కేబుల్‌ను కర్రకు అనుసంధానంగా ఉంచారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు కర్ర స్థానంలో విద్యుత్ పోల్‌ను బిగించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



ధ్రువాన్ను రెడ్డి (ఫైల్)

నర్సాపూర్, మే30: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన నర్సాపూర్ సమీపంలో శుక్రవారం జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. చిలిపిచెడ్ మండలం చండూర్‌కు చెందిన సంగారెడ్డి రామిరెడ్డి, అతని భార్య మాధవి, కుమారుడు ధ్రువాన్సరెడ్డి(3)తో కలిసి చండూర్ నుంచి హైదరాబాద్‌లోని మల్లంపేట్‌కు శుక్రవారం ఉదయం స్కూటీపై బయలుదేరారు. నర్సాపూర్ దాటిన తర్వాత సబ్‌స్టేషన్ వద్ద అజాగ్రత్తో, అతివేగంతో నడపడంతో రోడ్డు పక్కన ఉన్న స్టీల్ గార్డ్‌కు బలంగా ఢీకొన్నాడు. ప్రమాదంలో స్కూటీ ముందర కూర్చున్న బాలుడు ధ్రువాన్సరెడ్డి రోడ్డు పక్కనున్న గార్డ్‌కు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న రాంరెడ్డి భార్య మాధవికి గాయాలయ్యాయి. హుటాహుటీన నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి బాలనగర్‌లో ని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. రాంరెడ్డి తండ్రి యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

# బడిబాటకు సన్నద్ధం



బడిబాటలో భాగంగా పోషకులతో సమావేశమైన ఉపాధ్యాయులు(ఫైల్)



పెద్దశంకరంపేటలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

- జూన్ 6నుంచి 19వ తేదీ వరకు బడిబాట
- సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య
- జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్

మెదక్ మున్సిపాలిటీ, మే 30: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రభుత్వం జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ నిర్ణయించింది. కేసీఆర్ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు బడిబాట కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్నారు. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీలతో కలిసి బడిబాట నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రోజూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు తమ పరిధిలోని గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలి.

### జిల్లాలో 902 పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 902 ఉన్నాయి. ఇందులో 628 ప్రాథమిక, 128 ప్రాథమికోన్నత, 146 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 70 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది. బడిబాటలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు కార్యాచరణ రూపొందించారు. అన్ని ఆవాస ప్రాంతాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ఆంగ్ల మాధ్యమ తరగతులతో పాటు డిజిటల్ తరగతులు ఏర్పాటుపై తల్లిదండ్రులకు వివరించి విద్యార్థుల నమోదును పెంచేందుకు చర్యలు తీసుకుంటారు. జూన్ 12న యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేయాలని విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాలలో పేర్కొన్నది.

### సర్కార్ బడుల్లో ఆంగ్ల బోధన

కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇంగ్లిష్ మీడియం చదువుతో పాటు పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు మన ఊరు- మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడంతో సర్కారు బడులకు కొత్త కళ వచ్చింది. ప్రభుత్వ పాఠశాలల మెరుగుకై కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, కొత్త తరగతి గదులు, ప్రహరీ నిర్మాణాలు, డిజిటల్ తరగతుల వంటి మౌలిక సదుపాయాలు సమకూర్చారు. కేసీఆర్ నిర్ణయంతో పేద పిల్లలకు ఎంతో మేలు కలుగుతున్నది. ఈ నేపథ్యంలో సర్కారు బడుల్లో భారీగా ప్రవేశాలు పెరిగాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ మాట్లాడుతూ సర్కార్ బడుల్లోనే అర్హులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, దుస్తులు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రాథమిక స్థాయిలో ఏఐతో విద్యా బోధన అందిస్తున్నామన్నారు.

### టీచర్ల సమస్యలు పరిష్కారించాలి:ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రభుత్వ బడుల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. హవేళీఘనపూర్‌లోని డైట్ కళాశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్సీ శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారన్నారు. ఉన్నతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో సూచించినట్లు ఉపాధ్యాయుల సమస్యలైనా జీవో 317, పాత పెన్షన్ విధానం అమలు చేయడం, పీఆర్సీ పెండింగ్, డీఏలను, బీపీఎస్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీఈవో రాధాకిషన్, ఏఎంవో సుదర్శనమూర్తి, కోర్స్ డైరెక్టర్ గంగయ్య, తపస్ నాయకులు లక్ష్మణ్, స్వరూప, మాధవరెడ్డి, రామరావు ఉన్నారు.

### బడిబాట కార్యక్రమాలు..

- అర్హత గల అంగన్‌వాడీ పిల్లలను సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్చాలి.
- బడి బయట పిల్లలను గుర్తించాలి. డ్రాపౌట్స్, బడికి రాని పిల్లలు, చాలా కాలంగా స్కూళ్లకు హాజరు కాని వారిని గుర్తించి బడిలో చేర్పించాలి. ఈ విషయంలో ఉమెన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల సహాయం పొందాలి.
- బాల కార్మికులను గుర్తించి వారిని సంబంధిత బడిలో చేర్పించాలి.
- జూన్ 6న స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం.
- జూన్ 7న ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడీడు పిల్లలను గుర్తించడం.
- జూన్ 8, 9, 10వ తేదీల్లో కరపత్రాల పంపిణీ, బడి బయట పిల్లల గుర్తింపు.
- జూన్ 11న అప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష
- జూన్ 12న బడుల పునఃప్రారంభ సమయంలో తల్లిదండ్రులకు స్వాగతం పలకాలి. కమ్యూనిటీ అండ్ ప్రజాప్రతినిధులు సంప్రదాయక పద్ధతుల్లో బడిబాట నిర్వహించాలి. పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు పంపిణీ
- జూన్ 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ నిర్వహణ.
- జూన్ 16న తరగతి గదుల్లో అభ్యసన సామర్థ్యాలకు సంబంధించిన పోస్టర్లు వేసి, పిల్లలు తయారు చేసిన చార్టులు ప్రదర్శించాలి.
- జూన్ 17న సమీకృత విద్య, బాలికా విద్యాదినోత్సవం నిర్వహణ
- జూన్ 18న తల్లిదండ్రులకు తరగతి గదుల డిజిటలీకరణ, ఆధునీకరణ సౌకర్యాలు చూపాలి.
- జూన్ 19న బడిబాట ముగింపు, స్పోర్ట్స్ డే నిర్వహణ.

### బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

పెద్దశంకరంపేట, మే 30: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. బడిబాటలో భాగంగా ఎంఈవోతో పాటు ఉపాధ్యాయులందరూ ఇంటింటికీ తిరుగుతూ బడీడు విద్యార్థులను తప్పనిసరిగ్గా బడిలో చేర్పించాలన్నారు. ఆయనతో హెచ్‌ఎంలు విఠల్, సుధీర్, సత్యకుమార్, లక్ష్మన్, సిద్దిరాములు, సాయాగౌడ్ ఉన్నారు.

# అమ్మవారి దయతో అందరూ బాగుండాలి

- పెద్దమ్మను దర్శించుకున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్



ఝాన్సీలింగాపూర్‌లో పెద్దమ్మ కల్యాణంలో పాల్గొన్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్



కంఠారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

రామాయంపేట, మే 30: మండలంలోని ఝాన్సీలింగాపూర్ గ్రామంలో పెద్దమ్మ కల్యాణానికి రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హాజరయ్యారు. శుక్రవారం రామాయంపేటకు విచ్చేసిన మండలి డిప్యూటీ చైర్మన్‌కు తహసీల్దార్ రజినీకుమారి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం ఝాన్సీలింగాపూర్ గ్రామంలోని పెద్దమ్మను దర్శించుకుని కల్యాణంలో పాల్గొన్నారు. అమ్మవారికి పూజా కార్యక్రమాలను చేపట్టి మాట్లాడారు. అమ్మవారి కృషి ప్రతి ఒక్కరూ బాగుండాలని కోరుకున్నట్లు తెలిపారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. అనంతరం శాసన మండలి చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మానెగల్ల రామకిష్టయ్య, పుట్టి అక్షయ్‌కుమార్ ఉన్నారు. ఝాన్సీలింగాపూర్‌లో పెద్దమ్మ కల్యాణ మహోత్సవాలకు బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు తిరుపతిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కంఠారెడ్డి వెంట రైతు బంధు సమితి మండల మాజీ చైర్మన్ బానప్పగారి నర్సారెడ్డి, మైలారం భిక్షపతి తదితరులు ఉన్నారు.

# నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు



చేగుంట: విత్తనాలను పరిశీలిస్తున్న డీఏవో



పాపన్నపేటలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ, ఏవో

**-జిలా వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్**

చేగుంట, మే30: రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. చేగుంటలోని ఎరువులు, విత్తనాల షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆయనతో చేగుంట వ్యవసాయశాఖ అధికారి హరిప్రసాద్ ఉన్నారు.

**వెల్దుర్తిలో..**

వెల్దుర్తి, మే 30: వెల్దుర్తిలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి ఝాన్సీ, ఇన్‌చార్జి ఎస్సై జ్యోతి తనిఖీ చేశారు. దుకాణాల్లోని రిజిస్టర్లు, స్టాక్‌ను పరిశీలించారు. లైసెన్స్ కలిగి, ప్రభుత్వ అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలు, ఎరువులు విక్రయించాలన్నారు.

**చిలిపిచెడ్‌లో..**

చిలిపిచెడ్, మే 30: చిలిపిచెడ్ రైతు ఆగ్రో సేవా కేంద్రం, ఫర్టిలైజర్ దుకాణంలో మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్, ఎస్సై నర్సింహులు తనిఖీ చేసి, విత్తనాల శాంపిల్స్ పరిశీలించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని తునికి కేవీకే, రాంజేంద్రనగర్ వ్యవసాయ శాస్త్రవేతలు డాక్టర్ రవికుమార్, పాపరావు, దేశ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత చిన్నబాబు రైతులకు సూచించారు. చిలిపిచెడ్, చిట్కుల్ రైతువేదికల్లో వర్షాకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

**పెద్దశంకరంపేటలో..**

పెద్దశంకరంపేట,మే30: విత్తనాలు, ఎరువులు కొంటే రసీదు లు తీసుకోవాలని ట్రైనీ ఎస్ఐ అరవింద్ తెలిపారు. పట్టణంలోని ఎరువుల, విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు.


**పాపన్నపేటలో..**

పాపన్నపేట, మే 30: మండలంలో పలు విత్తన, ఎరువుల దుకాణాల్లో ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఏవో నాగమాధురి తనిఖీలు నిర్వహించారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలన్నారు.

**అల్లాదుర్గంలో..**

అల్లాదుర్గం, మే 30: పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులను లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనాలన్నారు. స్టాక్ బోర్డు, రిజిస్టర్స్, బిల్లులు ఉంచుకోవాలని సూచించారు.

## వివాహ వేడుకల్లో దుబ్బాక ఎమ్మెల్యే



చేగుంట: పట్టణంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్రఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు

## 2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత

మెదక్, మే 30 (నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాసం పథకంలోఎంపికైన లబ్ధిదారులకు జూన్ 2 నుంచి మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం మంజూరీపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి విడతలో చేపట్టిన ఇండ్లను అన్ని గ్రౌండ్ అయ్యేలా చూడాలన్నారు. రెండో విడత ఎంపికలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో ఆమోదం పొందిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను నిబంధనలు మేరకు త్వరలో పంపిణీ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

చిన్నశంకరంపేట, మే30: బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సౌజన్యంతో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. గవ్వలపల్లికి చెందిన రవీందర్‌నాక్ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని స్థానిక నాయకులు సూచించడంతో వారు బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సౌజన్యంతో మరో రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌నాయక్, నాయకులు సుధాకర్, శ్రీనునాయక్, బాబు, విఠల్, దీప్‌సింగ్ ఉన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న నాయకులు

### వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆశీర్వదించారు. ఎస్.కొండాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణగౌడ్ కూతురు కొర్విపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముత్తిగళ్లబాబు వివాహానికి మాజీ ఎమ్మెల్యే హాజరై ఆశీర్వదించారు. నార్సింగ్ మండల మాజీ వైస్ ఎంపీపీ సుజాత శంకర్‌గారి కోడలు వివాహానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## మాజీ మంత్రికి పెండ్లి పత్రిక అందజేత



హరీశ్‌రావుకు పెండ్లి పత్రిక అందజేస్తున్న బీఆర్ఎస్ నేత

మెదక్ మున్సిపాలిటీ, మే 30: మెదక్ బీఆర్ఎస్ కో కన్వీనర్ కండెల్ల సాయిలు కుమారుడి వివాహం జూన్ 4న మెదక్‌లో జరగనున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, ప్రభురెడ్డి, రాజులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని వారి నివాసాలకు వెళ్లి పెండ్లి పత్రిక అందజేశారు.

## బీఆర్ఎస్ నాయకుడి అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే



అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

పాపన్నపేట, మే 30: మండలంలోని యూసూఫ్‌పేట గ్రామ బీఆర్ఎస్ నాయకుడు పెద్దన్నగారి శశిధర్‌రెడ్డి అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. గురువారం రాత్రి ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం విషయం తెలుసుకున్న ఆమె యూసూఫ్‌పేట గ్రామం చేరుకుని శశిధర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి కుటుంబీకులను ఓదార్చి సానుభూతి తెలిపారు. పాపన్నపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి,యూసఫ్‌పేట గ్రామ అధ్యక్షుడు ఉప్పరి శేఖర్,మాజీ ఎంపీటీసీ జ్యోతి సాయిలు, మాజీ సర్పంచ్ శ్రీనాథ్ రావు, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, గోపాల్, ఉమా మహేశ్వర్, వెంకోబా తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట,మే 30: వానకాలం తరుముకొస్తుంది,మండల పరిధిలోని వివిధ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని మిన్పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇప్పటికే మిన్పూర్‌లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమైందని ధాన్యాన్ని వెంట వెంటనే లారీల్లో పంపించాలని ఆదేశించారు. మిన్పూర్‌లో ధాన్యం బస్తాలు వెంట వెంటనే పంపకపోవడం పట్ల నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు దగ్గర పడ్డాయని కేవలం మిన్పూర్, కొడపాక, ముద్దాపూర్ గ్రామాల్లో వెనుకబడినట్లు ఆయన వెల్లడించారు. ఒక వేళ అనుకున్న విధంగా లారీలు తెప్పించుకొని రైతులకు ఏమాత్రం ఇబ్బందులు ఎదురవకుండా ధాన్యాన్ని తరలించాల్సిందిగా కలెక్టర్ సూచించారు. రైతులకు ఇబ్బందులు ఎదురవకుండా ధాన్యం గింజ కొనుగోలు చేయాల్సిందిగా ఆయన సూచించారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ సతీష్‌కుమార్ ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్, మే30: నర్సాపూర్‌లోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు జయశీల అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి, సంతాపాన్ని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, నయీమొద్దీన్, భిక్షపతి, పిల్లి ఆనంద్ ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా



శివ్వంపేట, మే 30: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ ఎంతో భరోసా ఇస్తున్నదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం శివ్వంపేట మండలానికి చెందిన లబ్దిదారులకు రూ.లక్షా13వేల500 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, నాయకులు నాగేశ్వర్‌రావు, రాజశేఖర్‌గౌడ్, యాదాగౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కూలీ డబ్బుల కోసం సహచరుడి హత్య

తూప్రాన్, మే 30: మద్యం మత్తులో గొడవపడి కూలి డబ్బుల కోసం సహచరుడిని హత్య చేసిన నిందితుడిని మనోహరాబాద్ పోలీసులు 24 గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పోతరాజ్‌పల్లి కమాన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి డీఎస్పీ నరేందర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ బండ్లగూడకు చెందిన మృతుడు నలిన్‌కుమార్‌తో పాటు అంజద్ కాళ్లకల్ శివారులోని ఇండస్ట్రీస్‌లో పని చేసి, అక్కడే కేటాయించిన రూమ్‌కు వెళ్లిపోయారు. అంజద్ తన ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం రాత్రి నలిన్‌కుమార్ అదే రూములో ఉండే నరేశ్‌తో కలిసి బయటకు వెళ్లారు. నలిన్ కుమార్ మద్యం సేవించగా, నరేశ్ తాగలేదు. రాత్రి 11 గంటలకు నలిన్‌కుమార్ మద్యం మత్తు లో నరేశ్‌తో డబ్బుల విషయమై గొడవపడ్డా డు. దీంతో నరేశ్, నలిన్‌కుమార్‌పై చేయి చేసుకోగా, నలిన్ వెల్లకిలా కిందపడ్డాడు. దీంతో తల వెనకాల తీవ్ర గాయమై మృతి చెందాడు. వెంటనే నరేశ్, నలిన్‌కుమార్ ఫోన్ తీసుకుని రూమ్‌కు తాళం వేసి, సెక్యూరిటీ గార్డును కూడా తాళం తీయమని అడగగా అతను తీయకపోవడంతో గోడ దూకి పారిపోయాడు. పక్కా ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హెల్పర్లు, CNC ఆపరేటర్లు, TIG వెల్డర్లు. జీతం: 12,000/- నుండి 30,000/- + PF & ESI, కంపెనీ: S2 ఇంజినీరింగ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్, ఖాజీపల్లి. సంప్ర: 7075474613.
NT-Prasad

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.